క్లుప్తంగా

అయ్యప్పకు పుష్పయాగం


పుష్పయాగంలో అయ్యప్ప స్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు డొంక అయ్యప్పస్వామి క్షేత్రంలో వార్షిక పవిత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి విశేషంగా పంచామృత అభిషేకం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పుష్పయాగం నిర్వహించారు. రాత్రికి కేరళ చండపంచనాద స్వరవాయిద్యములు, స్వామి వారికి విశేషంగా బంగారు కిరీటం, విశేష ఆభరణ సేవ, పులివాహనంపై నగరోత్సవం నిర్వహించారు. వివిధ దేవతల విచిత్ర వేషధారణ చూపరులను ఆకట్టుకుంది.

నేడు అయ్యప్పస్వామి పడి భజన

చీమకుర్తి: స్థానిక హరిహర క్షేత్రంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిభజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, వారి కుటుంబ సభ్యులతో పాటు పట్టణంలోని సర్వ దీక్ష స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. హరిహరక్షేత్రం నుంచి నగరేశ్వరస్వామి వారి వరకు నగరోత్సవం ఉంటుందన్నారు. నగరోత్సవంలో పాల్గొనే భక్తులు, జ్యోతులను పట్టుకునే భక్తులు పాల్గొనాలని తెలిపారు. నగరోత్సవంలో విచిత్ర వేషధారణలు, భజన బృందాలు, కోలాటాలు, భక్తిగీతాల ఆలాపనలు వంటి పలు రకాల భక్తి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

తాగేదెట్టాగా..?

- ఒంగోలు నగర ప్రజలకు బురద, మురికినీరు సరఫరా
- రెండు వారాల తర్వాత ఇచ్చిన నీళ్లు కూడా పనికిరాకపోవడంతో ప్రజల ఆగ్రహం
- మరమ్మతుల పేరిట 14 రోజులుగా నిలిచిపోయిన నీటి సరఫరా
- రెండు లక్షల మంది ప్రజలకు అవస్థలు
- తాగడానికి, నిత్యావసరాలకు నీళ్లు లేక అల్లాడుతున్న ప్రజలు


ఒంగోలు అన్నవరప్పాడులో సరఫరా అయిన బురదనీరు


ఒంగోలు భాగ్యనగర్‌లో వచ్చిన మురికినీరు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర ప్రజలకు గత 14 రోజులుగా నగరపాలక సంస్థ అధికారులు రక్షిత మంచినీరు సరఫరా చేయలేదు. శుక్రవారం ఎట్టకేలకు నీరు విడుదల చేయగా, బురద, మురికినీరు రావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేసిన పైపులైన్లకు ట్రయల్ రన్ నిర్వహించి ఇళ్లలోని ట్యాప్‌లకు మంచినీటిని వదలాలి. అలాంటిది, నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. మంచినీటి పైపులైన్ మరమ్మతులు గానీ, నూతన పైపులైన్ల ఏర్పాటుగానీ దశల వారీగా చేపట్టాల్సి ఉంది. అలాంటిది మంచినీటి పైపులైన్ల పనులు అత్యంత నాసిరకంగా చేయడంతో పైపులైన్లలోని బురద, మురికినీరు మొత్తం ఇళ్లలోని ట్యాపులకు రావడంతో అవి పనికొచ్చే అవకాశమే లేకుండా పోయింది. పైపులన్నీ బురదతో నిండిపోయి నీరు కూడా పూర్తిగా కలుషితమై ఎర్రటి బురదతో బయటకు రావడంతో అధికారులు, పాలకుల పనితీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

'సాక్షి'లో కథనం ప్రచురితమైనా పట్టించుకోని ఎమ్మెల్యే, అధికారులు...

పైపులైన్లకు మరమ్మతుల పేరుతో రోజుల తరబడి ప్రజలకు నీరు సరఫరా కాక అల్లాడుతున్న వైనంపై 'దాహమో..జనార్దనా' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఈ నెల 2వ తేదీ కథనం ప్రచురితమైంది. అయినప్పటికీ.. ప్రజల గోడు, బాధలు, మంచినీటి అవస్థలను కూటమికి చెందిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కాస్త కూడా పట్టించుకోలేదు. ప్రజలు నీటి కోసం నరకం చూస్తుంటే ఆయన చీమకుట్టినట్లు కూడా లేకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఒంగోలు నగర ప్రజల మంచినీటి కష్టాలు తీర్చడం స్థానిక ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ అధికారుల వల్ల కాదని తేలిపోయినట్లయింది. వారిపై ఆందోళనకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు శూన్యం...

నగరంలోని ప్రజలకు కొత్త మంచినీటి కనెక్షన్లు ఇస్తున్నాం.. అందుకోసం మంచినీటి పైపులైన్లను మరమ్మతులు చేస్తున్నామంటూ నవంబర్ 23వ తేదీ ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా నవంబర్ 25 నుంచి 28వ తేదీ వరకు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నామని ఆయా ప్రాంతాలను కూడా ప్రకటించారు. అయితే, నవంబర్ 28వ తేదీ దాటినా.. డిసెంబర్ 6వ తేదీ వరకు మంచినీటి సరఫరా ఊసేలేదు. దాంతో ఒంగోలు నగర ప్రజలు దాహంతో అలమటించారు. సకాలంలో మరమ్మతులు పూర్తిచేయడంలో విఫలమైన అధికారులు 14 రోజులుగా నగర ప్రజలకు నీరివ్వలేకపోయారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ట్యాంకర్లతో నీరు తోలుతున్నామని, నగర శివారు ప్రజల నీటి అవసరాలు తీరుస్తున్నామని చెబుతున్న అధికారులు.. ఇన్ని రోజులుగా ప్రజలకు కనీసం ఒక్క ట్యాంకర్ నీరు కూడా పంపించలేదు. కనీసం నీళ్లు ఇవ్వలేని ప్రాంతాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేద్దామన్న ఆలోచన కూడా అధికారులకు రాలేదంటే.. ప్రజల సమస్యలతో మనకు అనవసరం.. ఎమ్మెల్యే జనార్దన్ దగ్గర మెప్పు పొందితే చాలన్నట్టు అధికారుల తీరు ఉందనే విషయం స్పష్టమవుతోంది. చివరికి రెండు వారాల తర్వాత మురికినీరు, బురద నీరు ఇచ్చి మ..మ..అనిపించడంతో ఎమ్మెల్యే జనార్దన్‌కు, నగరపాలక సంస్థ అధికారులకు నగరవాసులు శాపనార్థాలు పెడుతున్నారు.

నిబంధనల మేరకే భవనాలు నిర్మించాలి

- ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో భవనాలు నిర్మించుకునే వారు నిబంధనలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం ఓపెన్ ఫారమ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ ఏపీడీపీఎంఎస్ షార్ట్ ఫాల్, టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, రాష్ట్ర పట్టణ ప్రణాళికా సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ప్రతి శుక్రవారం అభివృద్ధి చెందుతున్న ఒంగోలు నగరంపై సమీక్ష నిర్వహించాల్సి ఉందన్నారు. టౌన్ మాస్టర్ ప్లాన్ తుది దశలో ఉన్నందున నగర ప్రజల నుంచి కూడా సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి చెందుతున్న ఒంగోలు నగరంలోని ప్రధాన వీధుల్లో ఉన్న భవనాలకు ఎలాంటి డీవియేషన్ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. షార్ట్‌ఫాల్స్ లేకుండా చూసుకోవాలని, నగర పాలక సంస్థలో అనుమతి పొంది రోడ్డు వైడనింగ్ ఇచ్చిన ప్రదేశాలలో ఎట్టి పరిస్థితుల్లో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. అందుకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం...

ఒంగోలు నగరపాలక సంస్థ సాధారణ, అత్యవసర సమావేశాలను శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు నగర మేయర్ సుజాత తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కౌన్సిల్ హాలులో 3 గంటలకు సాధారణ సమావేశం, 4 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహిస్తామన్నారు. తొలుత ఉదయం అని ప్రకటించామని, ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు ఉన్నందున సాయంత్రానికి మార్పు చేశామని, సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఇది మంచి వేదిక

- జేసీ గోపాలకృష్ణ


కాలనీ వాసులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, అధికారులు

మద్దిపాడు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులు మంచి వేదికలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు మండలంలోని లింగంగుంట గ్రామంలో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని, ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని వీలైనంతవరకు అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులను రెవెన్యూ సదస్సుల వద్ద అందుబాటులో ఉంచామని అన్నారు. వచ్చిన అర్జీలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 64 అర్జీలు రాగా 19 అర్జీలు మ్యుటేషన్ కోసం, ఒక అర్జీ ఎస్ఎస్పీ కెనాల్ కు సంబంధించిన భూవివాదం, మరొకటి దేవదాయ శాఖకు చెందిన భూమి పై వివాదం పరిష్కారానికి, సర్వే కోసం మూడు అర్జీలు, ఇళ్ల స్థలాల కోసం 40 అర్జీలు వరకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ వసుంధర, తహసీల్దార్ సుజన్ కుమార్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జయంత్ బాబు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు


కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘ నాయకులు


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏకేయూ వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ద్రవిడ దేశం అధ్యక్షుడు కృష్ణారావు, తదితరులు


కొత్తపట్నంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శ్రీకృష్ణ, శాంతారావు, తదితరులు

ఒంగోలు సబర్బన్: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఒంగోలు నగరంలోని ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో యూనియన్ నాయకుడు, సీనియర్ అసిస్టెంట్ పయనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి అసిస్టెంట్ కమిషనర్ సోమసుందర్ ప్రసాద్ నివాళులర్పించారు. నక్కల వెంకట సుబ్బారావు, కోట సుధాకర్, లక్ష్మీకుమార్, కొండలరావు, రవికుమార్, అహ్మద్‌బాషా, వెంకటరెడ్డి, పెద్దమ్మాయి, అంజమ్మ, ప్రసాద్, దారా సుధాకర్, షరీఫ్, హరిప్రసాద్, నరసింహారావు, వెంకటేష్, రవి, సునందరావు, రఫీ, తిరుపతిరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి...

అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించాలని ద్రావిడ దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, జై శ్రీకృష్ణ బీసీ సమితి వ్యవస్థాపకుడు ఒంగేరు కృష్ణారావు కోరారు. శుక్రవారం ఒంగోలులో వివిధ బీసీ సంఘాలు ఏర్పాటుచేసిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మిర్యాలపాలెం సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. యాదవ జేఏసీ అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణయాదవ్, కాటమరాజు విగ్రహ ఫౌండర్ మల్లెబోయిన రాజుయాదవ్, జై శ్రీకృష్ణ బీసీ సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆపద్బాంధవుడు.. అంబేడ్కర్...

ఒంగోలు సిటీ: అణగారిన వర్గాల ప్రజల ఆపద్బాంధవుడు అంబేడ్కర్ అని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి కొనియాడారు. శుక్రవారం ఆంధ్రకేసరి యూనివర్సిటీ సెమినార్ హాల్లో ఎస్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టరు మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి వీసీతో పాటు రిజిస్ట్రార్ హరిబాబు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహనరావు అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ ప్రొఫెసర్ సోమశేఖర్, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ ఆధ్వర్యంలో...

బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని అంబేడ్కర్ విగ్రహానికి అధ్యక్షుడు పర్రె వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జాలరామయ్య, రాష్ట్ర కార్యదర్శి పాలేటి సువర్ణబాబు, జిల్లా నాయకులు నివాళులర్పించారు. ఒంగోలు మండల పరిధిలోని కరవది బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ సీనియర్ నాయకుడు పి.సీతారామయ్య, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వి.హనుమారెడ్డి, సీపీఐ ఒంగోలు మండల కార్యదర్శి గద్దల రవి, కరవది గ్రామ కార్యదర్శి గద్దె సుబ్బారావు, కరవది హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘ ఒంగోలు మండల అధ్యక్షుడు గద్దె సుబ్బారావు, తదితరులు నివాళులర్పించారు.

సమాన హక్కుల కోసం పోరాడిన అంబేడ్కర్...


ఒంగోలు టౌన్: అన్ని రంగాల్లో సమాన హక్కుల కోసం అంబేడ్కర్ పోరాడారని స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అన్నారు. జీజీహెచ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, ఆర్ఎంఓ మాధవీలత, యూనియన్ గౌరవాధ్యక్షుడు సుధాకర్‌బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ బాలాజీ నాయక్, నర్సింగ్ యూనియన్ నాయకులు మంజేష్, వెంకటరావు, ప్రసాద్, సౌజన్య, బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

పలు సంఘాల ఆధ్వర్యంలో...

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక నీలంపాలెంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్ ప్రారంభించారు. మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో ఒంగోలులోని గుడ్‌న్యూస్ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ స్థలంలో నిర్వహించిన వర్ధంతి సభలో అల్లూరు అంబేడ్కర్ యువజన సంఘాల సమన్వయకర్త, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈతముక్కల, అల్లూరు, బీరంగుంట, పాదర్తి, కొత్తపట్నం అంబేడ్కర్ నగర్, రాజుపాలెం, మడనూరు అంబేడ్కర్ నగర్, సంకువారిగుంట గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కసుకుర్తి శ్రీను, దుగ్గిరాల విజయకుమార్, హెచ్ఎం నాగేశ్వరరావు, చెక్కా జయలక్ష్మి, సీహెచ్ మహేష్, చెక్కా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు


కరవదిలో నివాళులర్పిస్తున్న సీపీఐ, రైతు సంఘ నాయకులు

చీమకుర్తిలో నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


చీమకుర్తి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


చీమకుర్తి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ యద్దనపూడి, జెడ్పీటీసీ వేమా


సంతనూతలపాడు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దుంపా చెంచిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు


చీమకుర్తి: మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి


మద్దిపాడు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం చీమకుర్తిలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు భీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, సోమా శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య, పాలపర్తి వెంకట్రావు, బడే అయ్యపరెడ్డి, గోపురపు చంద్ర, మేకల యల్లయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, కమిషనర్ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో కార్యాలయం సిబ్బంది, కౌన్సిలర్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేఎస్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

కేఎస్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు ఆధ్వర్యంలో కేఎస్‌పీఎస్ నాయకులు, జంగాల కోటి, వేమా చినకోటేశ్వరరావు, బండ్ల డేవిడ్, పిన్నిక శ్రీనివాసరావు, ఇస్తర్ల శంకర్, ఆరెతోటి రాంబాబు, గంటెనపల్లి పోతురాజు పోలీస్‌స్టేషన్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు బొంతా ఏసుదాస్, జనరాజుపల్లి యాకోబు, జడా విజయకుమార్, కర్నా ప్రసాద్, బుట్టి సాల్మన్, నాగభూషణం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. చీమకుర్తి సీఐ ఎం.నాగభూషణం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

చీమకుర్తి రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్య ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పులి వెంకరెడ్డి, సురేష్, ఎంపీడీఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. మంచికలపాడులో బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సర్పంచ్ పెరికల నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంతనూతలపాడు: స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బుడంగుంట విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలదామందరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎస్కే రంతుల్లా, నాయకులు మండవ వెంకటనారాయణ, ఆలూరి వెంకటేశ్వర్లు, కుంచాల యానాది, ఎస్కే మస్తాన్ వలి, వల్లెపు శీను, ఏ వెంకట సుబ్బయ్య, పలువురు అంబేడ్కర్ సంఘ నాయకులు మహానేతకు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ లేబర్ బోర్డ్ డైరెక్టర్ పెద్దిపోగు కోటేశ్వరరావు శుక్రవారం బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర మాదిగ నాయకులు జడ ఇమ్మానుయేలు, ఎస్.రాజ్ పాల్గొన్నారు. భారత్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం సంతనూతలపాడులో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కంకణాల గోపి, మార్పుడి జనార్దన్, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్దిపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి శుక్రవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, మరో కార్యదర్శి మేకల కృష్ణారెడ్డి, మద్దాల లక్ష్మీనారాయణ, సింగయ్య, బొమ్మల రామాంజనేయులు, పైనం ప్రభాకర్, దుడ్డు వినోద్, అన్వేష్, రజని, సంధ్య, మస్తానమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం సాయంత్రం ఐదు గంటలకు రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సినీ నటులు, మాజీ ఎంపీ మురళీమోహన్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయకుమార్ ప్రారంభించనున్నట్లు ఎన్నారై డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ఎంపీలు తేనేటి కృష్ణప్రసాద్, మాగుంట శ్రీనివాసులరెడ్డి, కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి వస్తున్నట్లు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వాహకుడు డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీగిరి గిరి ప్రదక్షిణ


శ్రీగిరి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి గిరి ప్రదక్షిణను కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు, శంకు, చక్ర నామాలను పట్టుకుని గోమాత ముందు నడువగా భక్తిపారవశ్యంతో శ్రీగిరి గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా సాగింది. అనంతరం శ్రీగిరి పర్వతంపై కొలువై ఉన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని భక్తులు తరించారు. ఈ నెల 11న గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కమిటీ నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో పాల్గొన్న 38 మందికి ప్రశంస పత్రాలు, జ్ఞాపిక అందించి అభినందించారు.

ఘనంగా మహానటి సావిత్రి జయంతి


సావిత్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆలిండియా కళారంగ సభ్యులు

ఒంగోలు మెట్రో: ఆలిండియా కళారంగం పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మహానటి సావిత్రి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్షులు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

చీమకుర్తి రూరల్: మండలంలో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావుకు రెవెన్యూ అధికారులు కనీస సమాచారం ఇవ్వకుండా గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇలపావులూరు సచివాలయం పరిధిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇలపావులూరు ప్రాదేశిక సభ్యుడిగా ఎంపికైన యద్దనపూడి శ్రీనివాసరావు ప్రస్తుతం చీమకుర్తి మండల ఎంపీపీగా కొనసాగుతున్నారు. చీమకుర్తి మండల ప్రజా పరిషత్ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రొటోకాల్‌కు తూట్లు పొడిచారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా ఎంపీపీ పదవిని అవమానపరిచే విధంగా కనీస సమాచారం ఇవ్వని రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.